## క్లుప్తంగా

### పూర్వ విద్యార్థుల చేయూత



హసన్‌పర్తి: కిట్స్ కళాశాలలో ఈసీఐ చదువుతున్న విద్యార్థికి పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. ఈమేరకు రూ.2 లక్షల విలువగల చెక్కును అందించారు. కళాశాలలో ఈసీఐ చదువుతున్న నమ్రత ఆర్థికంగా సతమతమవుతూ ట్యూషన్ ఫీజు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, ప్రొఫెసర్ వేణుమాధవ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకరాచారి అభినందించారు.

### ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ప్రతిభ



కేయూ క్యాంపస్: ఇటీవల డిగ్రీ పూర్తి చేసుకున్న యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి ఎ.అనిల్.. సెంట్రల్ యూనివర్సిటీలో గణిత విభాగంలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ కోర్సులో సీటు సాధించారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా వేంనూరు గ్రామానికి చెందిన అనిల్ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించడంపై ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గణిత విభాగం అధ్యాపకులు నాగయ్య, అంజన్‌రావు, శ్రీలక్ష్మి, పాలక మండలి సభ్యుడు చిర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

### జవహర్ కాలనీలో నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: బల్దియా పరిధి హనుమకొండలోని 56వ డివిజన్ జవహర్ కాలనీ ప్రాంతంలో ఇటీవల నూతన బ్రిడ్జి నిర్మించిన నేపథ్యంలో నీటి పైపులను తిరిగి అమర్చాల్సి ఉంది. ఈక్రమంలో నేటి నుంచి మూడు రోజుల పాటు నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు బల్దియా ఈఈ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్‌నగర్ కుడివైపు ప్రాంతంలోని రోడ్డు నంబర్ -1 నుండి రోడ్డు నంబర్ -6 వరకు ఉన్న నివాసాలకు మూడు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ఖిలా వరంగల్: బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన సోమవారం మధ్యాహ్నం వరంగల్ ఫోర్ట్‌రోడ్డు వాల్‌మార్ట్ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం రంగశాయిపేట నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆటో.. వాల్‌మార్ట్ సమీపంలోకి చేరుకోగానే ముందు టైరు ఊడి అదుపు తప్పి వరంగల్ నుంచి ఖిలా వరంగల్ పంపు వైపు వస్తున్న బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దాంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


### పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని అధ్యాపకులు కోరారు. ఈమేరకు కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజును సోమవారం కలిసి విన్నవించారు. ఫుల్‌టైం వర్క్‌లోడు గల కాంట్రాక్టు లెక్చరర్లుగా నియమించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకులు సదానందం, చందర్, మౌనిక, రమాదేవి, భిక్షపతి, అచ్చయ్య, సద్గుణ, సతీష్, చింతం ప్రవీణ్, ఫాతిమా పాల్గొన్నారు.

### పాపన్నగౌడ్ గోపాలపురం కార్యవర్గం ఎన్నిక

హసన్‌పర్తి: సర్దార్ పాపన్నగౌడ్ గోపాలపురం శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూనూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లి మొగిలి, ప్రధాన కార్యదర్శిగా వల్లాల రాజ్‌కుమార్, కోశాధికారిగా మండ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా తిమ్మయ్యపల్లి జ్ఞానేశ్వర్, మాచర్ల రామచంద్రం, పంజాల ఓదెలు, వడ్లకొండ శ్రీనివాస్, మహేందర్, అనిల్, వెంకటేశంను ఎన్నుకున్నారు.

### కుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు



నయీంనగర్: కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రు నాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మ మాట - అంగన్‌వాడీ బాట



మడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు



పైడిపల్లిలో ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ షీబారాణి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు



హసన్‌పర్తి: ర్యాలీలో పాల్గొన్న మహిళలు

మడికొండ: అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంపై మడికొండలోని అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లతో కలిసి డీడబ్ల్యూఓ కె.మధురిమ ఆధ్వర్యంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 3ఏళ్ల నుంచి 6ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, పోషణ అభియాన్ డీసీ సుమలత, హెచ్‌ఎం సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, వసంత, రాజ్యలక్ష్మి, రాణి, కవిత, రజిత, లలిత, మంజుల, రాజమణి, జోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

**పైడిపల్లిలో..**

దేశాయిపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రభుత్వం అమలు చేసేందుకు, ప్రవేశాలు పెంచేందుకు ఈనెల 15నుంచి 20వ తేదీ వరకు ఐసీడీఎస్ చేపట్టిన అమ్మమాట – అంగన్‌వాడీ బాట ప్రత్యేక కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి హైమావతి కోరారు. పైడిపల్లిలో సెక్టార్‌లోని 14వ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమాలను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రీస్కూల్ పిల్లలను నమోదు చేయాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి మాట్లాడుతూ లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో వరంగల్ సీడీపీఓ విశ్వజ, పైడిపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ జె.లావణ్యతో పాటు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



ఖిలా వరంగల్: కరీమాబాద్‌లో..

**హసన్‌పర్తిలో..**

హసన్‌పర్తి: నగరంలోని 65వ డివిజన్ చింతగట్టులో అమ్మమాట – బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్యపై విస్తృత స్థాయి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు. అందులో భాగంగా ఈనెల 15నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 'అమ్మమాట – బడి బాట' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈమేరకు ఇంటింటికి వెళ్లి చిన్నారులను గుర్తించి, వారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.స్వప్న, పద్మ, స్వరూప, శైలజ, ఆశ వర్కర్లు నవమణి, స్రవంతి, మాధవి, అరుణ, లలిత, కవిత, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**పలు డివిజన్లలో..**

ఖిలా వరంగల్: చిన్నపిల్లలకు ఆటపాటలతో చక్కటి విద్యను అందించాలని కార్పొరేటర్లు మరుపల్లి రవి, పోశాల పద్మ సూచించారు. వరంగల్ 39, 40, 41వ డివిజన్లలోని లక్ష్మీనగర్, ఉర్సు కరీమాబాద్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాధవి, రమాదేవి ఆధ్వర్యంలో వేర్వేరుగా అమ్మమాట – అంగన్‌వాడీ బాట ర్యాలీని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్లు హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ నుంచి యూకేజీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. తమ చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు.

## నైపుణ్యాలు పెంచుకునేందుకు దోహదం

విద్యారణ్యపురి: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసుకునేందుకు పోస్టర్ మేకింగ్ పోటీలు దోహదపడుతాయని హనుమకొండ మండల విద్యాశాఖాధికారి రాంకిషన్‌రాజు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ఆదేశాల మేరకు హనుమకొండలోని బాలికల లష్కర్‌బజార్ హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీలను సోమవారం నిర్వహించారు. డి.తేజశ్రీ (టీజీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్ వరంగల్ వెస్ట్) ప్రథమ బహుమతి, ఎస్‌కే.సోనియా కౌసర్ (జెడ్పీహెచ్‌ఎస్ శ్యాయంపేట) ద్వితీయ, కె.సౌందర్య (లష్కర్ బజారు గర్ల్స్ హై స్కూల్) తృతీయ బహుమతి సాధించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ అలిగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు రాధాకృష్ణాచారి, సతీష్, ప్రకాశ్, జ్యూరీ మెంబర్లు విజయ్ భాస్కర్, కుమారస్వామి, సురేందర్, అశోక్‌కుమార్, నవీన్‌కుమార్, వెంకటయ్య, నర్సింగరావు, సీఆర్‌పీలు షఫీ, మున్నీ, రేణుక పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

## ఫేక్ డాక్యుమెంట్‌తో సీసీ జారీ?

- ఏఓను నిలదీసిన వాహన యజమాని

ఖిలా వరంగల్: వరంగల్ ఆర్టీఏ కార్యాలయ పరిధిలో ఇతర కారు నంబర్‌కు ఓ వాహనదారుడు ఫేక్ డాక్యుమెంట్ సృష్టించినట్లు సమాచారం. ఏఓ స్థాయి అధికారిని నమ్మించి ఇతర కారు నంబర్‌ను తన కారుగా చెప్పి మరో జిల్లాకు సీసీ కొట్టించాడు. ఈ విషయం అసలు కారు ఓనరుకు తెలిసింది. ఆ వాహన యజమాని ఆర్టీఏకు వచ్చి సీసీ కొట్టించిన ఏఓను నిలదీసినట్లు తెలిసింది. జారీ చేసిన సీసీని తక్షణమే రద్దు చేయాలని బాధిత కారు యాజమాని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, దానిపై సమగ్ర విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈవిషయపై గతంలోనే బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

### ఆర్‌డీ కార్యాలయంలో కౌన్సెలింగ్

వరంగల్ అర్బన్: హనుమకొండలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 'కుడా' కాంప్లెక్‌లోని వరంగల్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో బల్దియా సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, నాలుగవ తరగతి ఉద్యోగులకు సోమవారం కౌన్సెలింగ్ జరిగింది. ఆర్‌డీ షాహిద్ మసూద్, కమిటీలోని సభ్యులు ఎప్పుడు ఉద్యోగంలో చేరారు, ఎంత కాలం నుంచి కొనసాగుతున్నారనే అంశాలతోపాటు, మెడికల్ వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో సీనియార్టీ ప్రకారం 40శాతం మంది ఉద్యోగులకు బదిలీలు జరగనున్నట్లు సమాచారం.

## కులగణన చేసేవరకు పోరు ఆపేది లేదు



సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నయీంనగర్: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేసి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచేవరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు కామారెడ్డి సభలో బీసీలకు సమగ్ర కులగణన చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. దాన్ని ప్రభుత్వానికి గుర్తు చేయడానికి, ఒత్తిడి పెంచడానికి కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో సమగ్ర కులగణన సాధన యాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు. ఈనెల 14న కామారెడ్డి నుంచి ఈ యాత్ర ప్రారంభమై కరీంనగర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజులపాటు కొనసాగుతుందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 18న హనుమకొండ హంటర్‌రోడ్ సత్యం ఫంక్షన్ హాల్‌లో సమగ్ర కులగణన సాధన యాత్ర సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చు ఆనందం, దాడి మల్లయ్య యాదవ్, బొనగాని యాదగిరి గౌడ్, తొటం రవీందర్, తమ్మెల శోభారాణి, అశోక్ గౌడ్, మధు, డాక్టర్ రాము, రాధిక, రాజేష్ పాల్గొన్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఖిలా వరంగల్ మండలం వసంతాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వసంతాపూర్‌కు చెందిన రాళ్లపల్లి ఐలయ్య(55) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. దాంతో ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఐలయ్య ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాంతో పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో కేకలు వేయగా స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే 50శాతం కాలిన గాయాలతో కుప్పకూలిపోయిన క్షతగాత్రుడిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గీసుగొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

## ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న మహాసభ నాయకులు

హన్మకొండ అర్బన్: ముదిరాజ్ కులస్తులను బీసీ 'ఏ'లో చేర్చి, వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభాగల ముదిరాజ్‌లు సమాజంలోని అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, మంత్రివర్గంలో ముదిరాజ్‌లకు స్థానం కల్పించాలని సూచించారు. కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటుతో పాటు ప్రతీ సంవత్సరం రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. మత్స్యశాఖలోని సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని. మత్స్యకారులకు 50 ఏళ్లకే ఆసరా పింఛన్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు కేశబోయిన శ్రవణ్, శోభన్, సాంబమూర్తి, ప్రభాకర్, రామ్‌రాజ్, సమ్మయ్య, నర్సింగరావు, శంకర్, రమేష్, ప్రకాశ్, రవికుమార్, మహేందర్, కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటిలో గేట్‌వాల్వ్

- కలుషితమవుతున్న తాగునీరు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు



మురుగు నీటిలోనే ఉన్న గేట్‌వాల్వ్

మడికొండ: మురుగునీటిలో గేట్‌వాల్వ్ ఉండడంతో తాగునీరు కలుషితం అవుతోందని 46వ డివిజన్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ క్రమంలో అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏకలవ్య కాలనీ ఎదురుగా ఉన్న వాడలో తాగునీరును విడుదల చేసే గేట్ వాల్వ్ మురుగు నీటిలో ఉంది. నీటిని విడుదల చేసే సమయంలో మురుగునీరు.. తాగునీరులో కలిసి కలుషితం అవుతోందని ప్రజలు చెబుతున్నారు. మరమ్మతులు చేసే సమయంలో గుంతను తీసి మున్సిపల్ అధికారులు అలాగే వదిలివేయడంతో వరదనీరు గేట్‌వాల్వ్‌లోకి వెళ్తోంది.

## మాదక ద్రవ్యాల నివారణకు ప్రచారం



ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కాజీపేట అర్బన్: గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ కృషి చేస్తోంది. ఈమేరకు ఫ్లెక్సీల ఏర్పాటుతో ప్రచారం చేస్తోంది. కాజీపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కాజీపేట రైల్వే స్టేషన్, నిట్ వరంగల్, ఫారెస్ట్ ఆఫీస్, వడ్డేపల్లి వంద ఫీట్ల రోడ్డులోని ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు కాజీపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వేముల చంద్రమోహన్ వివరించారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## కుళ్లిన కూరగాయలు పడేస్తే చర్యలు

- మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల

సాక్షి స్పందన

వరంగల్: లక్ష్మీపురం మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న హోల్‌సేల్, చిల్లర వ్యాపారులు మిగిలిన, చెడిపోయిన కూరగాయలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తే చర్యలు తప్పవని వరంగల్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల హెచ్చరించారు. 'కూరగాయల మార్కెట్‌లో అపరిశుభ్రం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. మార్కెట్‌ను సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న వ్యాపారులను పిలిచి మురిగిపోయిన కూరగాయలను ఎక్కడ పడితే అక్కడ పడేయడం ఏంటని ప్రశ్నించారు. మార్కెట్‌లోని అన్ని మడిగెలపై పేర్లు ఎందుకు లేవని, వెంటనే సంబంధిత కమీషన్ లైసెన్సుల వ్యాపారుల పేర్లను రాయించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రేడ్ -2 కార్యదర్శి రాముకు ఆమె సూచించారు.



వ్యాపారిని హెచ్చరిస్తున్న కార్యదర్శి నిర్మల

## ప్లాస్టిక్ సర్జరీకి ఆద్యుడు సుశ్రుతుడు



సుశ్రుతుడి జయంతిలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కాశిబుగ్గ: ప్లాస్టిక్ సర్జరీని ప్రపంచానికి పరిచయం చేసిన తొలి శస్త్రచికిత్స వైద్యుడు సుశ్రుతుడు అని ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం, సుశ్రుత జయంతి వేడుకలను నగరంలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుశ్రుతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ వేల ఏళ్ల క్రితం సుశ్రుతుడు తొలి శస్త్ర చికిత్స నిర్వహించి అనేక వ్యాధులను నయం చేశారని గుర్తుచేశారు. ఆనాడు ఆయన రూపొందించిన మూల సూత్రాల ఆధారంగానే నేడు ప్లాస్టిక్ సర్జరీలు చేస్తున్నట్లు వివరించారు. సుశ్రుతుడిని ఫాదర్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జరీ అని వారు కొనియాడారు. అనంతరం సుశ్రుతుడు, ధన్వంతరి ఫొటోలను వైద్య విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డాక్టర్ సాంబమూర్తి, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, అధ్యాపకులు డాక్టర్ మధు, డాక్టర్ మహేష్, డాక్టర్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

## బీరన్న బోనాలను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: కురుమల ఆరాధ్య దైవమైన బీరన్న బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉర్సు బీరన్నస్వామి ఆలయ కమిటీ చైర్మన్, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి పిలుపునిచ్చారు. ఈనెల 17న తొలి ఏకాదశి సందర్భంగా ఉగ్గు కళాకారుల నృత్యాలు, కోలాటాల మధ్య భారీ ఊరేగింపుతో తొలి బోనాన్ని బీరన్నకు కురుమ కులస్తులు సమర్పించనున్నట్లు వివరించారు. ఈమేరకు వరంగల్ ఉర్సు కరీమాబాద్ బీరన్న దేవాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజాకార్ల కాలం నుంచి బీరన్నకు తొలిబోనాన్ని సమర్పించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17న ఉదయం 7గంటలకు పట్టు వస్త్రాల సమర్పణ, 10గంటలకు ఆర్యసమాజ జెండాను ఊరేగింపు తీసుకెళ్లి దేవాలయంలో ఏర్పాటు చేయడం, సాయంత్రం 3గంటలకు కురుమ కులస్తులు సామూహికంగా బయలుదేరి బీరన్నకు బోనాలు సమర్పిస్తారని వివరించారు. బోనాల ఊరేగింపులో ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ధర్మకర్తలు కోటేశ్వర్, అన్న కుమారస్వామి, నీలం యాకయ్య, మండల ప్రమీల, కోరె అయిలయ్య, మిరియాల కుమారస్వామి, కోల్పుల కోటేశ్వర్, గౌడ కోటేశ్వర్ రావు, పూజారి భద్ర భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మరుపల్లి రవి

## సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా



విద్యారణ్యపురి: కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ బాధ్యులు



కాళోజీ సెంటర్: కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్స్ జేఏసీ నాయకులు

విద్యారణ్యపురి: పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ తెలంగాణ ఆధ్వర్యంలో పెన్షనర్లు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ.. పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించకపోతే ఈనెల 31న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మౌన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఆందోళనలో ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ బాధ్యులు పులి సారంగపాణి, సర్వర్‌హుస్సేన్ తూర్పు సీతారాం, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, ప్రభుత్వ పెన్షనర్లు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు.

**నల్లబ్యాడ్జీలు ధరించి..**

కాళోజీ సెంటర్: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ జేఏసీ నాయకులు ఎస్.రాజయ్య, కర్రు సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టరేట్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ జేఏసీ నాయకులు నాగపురి సారయ్య, ఎస్.లక్ష్మీనారాయణ, డాక్టర్ వెంగళ్‌రెడ్డి, పెద్దూరి పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతులు

కాజీపేట: నగరానికి వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రంలో అత్యవసర సర్వీసు 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ రెగ్యులర్ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. 108 రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు.

**భట్టిని కలిసిన టీఎన్జీఓస్ నాయకులు**

హన్మకొండ అర్బన్: రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణలో భాగంగా హనుమకొండ కలెక్టరేట్‌కు సోమవారం వచ్చిన మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్జీఓస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా భట్టికి జ్ఞాపిక అందించి సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి పనికెల రాజేష్, కత్తి రమేష్, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

**రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి**

కాళోజీ సెంటర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకొని రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, వైస్ ప్రెసిడెంట్, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్‌కుమార్, ఫణికుమార్ పాల్గొన్నారు.

**ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం**

మడికొండ: రైతు భరోసాపై సమీక్షించడానికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మడికొండలో ఘన స్వాగతం పలికారు.